APTEL /26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి : 1 సంచిక : 177 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు పేజీలు : 8 సోమవారం 17 ఆగస్టు 2026 వెల : 05/-

## స్థానికంలో బీసీ రిజర్వేషన్లు

# లేనట్లే...?

### - చంద్రబాబు సంకేతాలు



అమరావతి, ఆగస్టు 16 : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఈ మేరకు సంకేతాలిచ్చారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పెరగడానికి వీలు లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ నివేదికతో బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించారు. అయితే శనివారం నివేదిక సమర్పించిన కమిషన్ ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను మరో నాలుగు శాతం మేర పెంపునకు ఇబ్బంది లేదని సూచించింది. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచనలో పడిందని అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 23.84 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీ జనాభాకు తగినట్లు మరో 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచడానికి మాత్రమే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 50.26 శాతం కాగా, ఆ లెక్కన 27.66 శాతం వరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడానికి సమస్య ఉ

2లో

### చంద్రగిరిలో

## ఏనుగుల బీభత్సం

▶▶ రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్



తిరుపతి, ఆగస్టు 16 : తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని

2లో

### హసీనాను అప్పగిస్తేనే బంగ్లాదేశ్

## ప్రధాని భారత్ పర్యటన



ఢాకా, ఆగస్టు 16: మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించే వరకు బంగ్లాదేశ్ నూతన ప్రధాని తారిఖ్ రెహ్మాన్ భారతదేశంలో పర్యటించే ప్రసక్తి లేదని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. పర్యటనకు అనుకూలమైన వాతావరణం ఏర్పడాలంటే హసీనా డిపాజిషన్ లేదా అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని బంగ్లాదేశ్ తేల్చిచెప్పింది. 2024లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో బంగ్లాదేశ్ విడిచి షేక్ హసీనా భారత్‌కు చేరుకున్న సంగతి

2లో

### రేపటి నుంచి ఏపీ అసెంబ్లీ

## వర్షాకాల సమావేశాలు..

### - మండలిలో హోరాహోరీ!




విజయవాడ, ఆగస్టు 16 : ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

#### స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ

సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత

2లో

### విజయవాడలో డీఎస్సీ టీచర్ల

## 'ఆత్మగౌరవ ర్యాలీ'.. వైసీపీపై ఫైర్

### - విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ



విజయవాడ, ఆగస్టు 16 : తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉ

2లో

## రైతు ఆర్థిక భద్రతే లక్ష్యం

### - మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, ఆగస్టు 16: ఎల్‌నినో ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, రైతు ఆర్థిక భద్రతే తమ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు పంటల బీమా ద్వారా మరింత ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఖరీఫ్--2026లో ఇప్పటివరకు పంటల బీమా కోసం 35.17 లక్షల నమోదు దరఖాస్తులు రావడం రైతుల్లో బీమాపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత

2లో

### బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి హాజరైన

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు
- నవ దంపతులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి
- సీఎంతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరు
- వేడుకకు హాజరైన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు



హైదరాబాద్, ఆగస్టు 16 : ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కుమార్తె జనని-సూర్యతేజ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శు

2లో

### బెల్జియంలో డ్రైనేజీ పనులు చేస్తుంటే..

### గోడలో బయటపడ్డ

## రూ.98 కోట్ల నిధి!

▶▶ పాత భవనంలో పనిచేస్తుండగా 18 ఏళ్ల యువకుడికి లభించిన నిధి



బెల్జియంలో ఓ 18 ఏళ్ల యువకుడికి ఊహించని అదృష్టం వరించింది. సాధారణ డ్రైనేజీ పైపుల మరమ్మతు పనుల్లో ఉండగా, అతనికి ఏకంగా రూ.98 కోట్ల (9-10 మిలియన్ యూరోలు) విలువైన బంగారు నిధి దొరికింది. బ్రస్సెల్స్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని సింట్-గిలిస్-డెండర్‌మాండే ప్రాంతంలో ఈ సంచలన ఘటన చోటుచేసుకుంది.

2లో

### చిట్టీల పేరుతో

## రూ.70 లక్షల మోసం?

### బాధితుల ఆందోళన



కృష్ణాజిల్లా, ఆగస్టు 16 : గుడివాడ ఎన్టీఆర్ కాలనీలో చిట్టీల పేరుతో సుమారురూ.70

2లో

# సమష్టి కృషితో జిల్లాను మరింత ముందుకు తీసుకెళదాం

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపు**



కడప, ఆగస్టు 15 : స్వాతంత్ర్య స్ఫూర్తితో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వైఎస్ఆర్ కడప జిల్లాను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం జిల్లా అధికారులు, ఉద్యోగులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 79 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం పొందిన భారతదేశం నేడు ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని, అప్పటి నుండి ఇప్పటివరకు దేశం సాధించిన అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, పరిణామాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. ప్రపంచంలో భారత్ తనదైన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న తరుణంలో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో చేపట్టిన పలు వినూత్న కార్యక్రమాలు దేశానికే స్ఫూర్తిగా నిలుస్తుండటం మనందరికీ గర్వకారణమని అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లాలో మరింత ఆరోగ్యవంతంగా, నాణ్యతతో చేపట్టిన "స్మార్ట్ కిచెన్" వ్యవస్థపై నీతీ ఆయోగ్ ప్రశంసలు లభించడం జిల్లా యంత్రాంగం చేపట్టిన వినూత్న ఆలోచనలకు, సమర్థవంతమైన అమలుకు లభించిన జాతీయ స్థాయి గుర్తింపుగా పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించడంతో పాటు ఆహార తయారీ, సరఫరా, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థ దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన "ప్రాజెక్ట్ టీఎస్ కూడా జిల్లాలో వినూత్న మార్పులకు నాంది పలుకుతోందని కలెక్టర్ తెలిపారు. యువతలోని సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణలకు కార్యరూపం ఇచ్చే ఉద్దేశంతో చేపట్టిన 'స్టార్ట్ అప్ కడప' ద్వారా ఏడాదికి 100 నూతన పరిశ్రమలను ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. యువతలోని ప్రతిభను ప్రోత్సహించి, వారి ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలచడంతో పాటు ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లాను పెట్టుబడులకు అనుకూలమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో "ఇన్వెస్ట్ కడప" యువతలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించే లక్ష్యంతో స్టార్టప్ కడప వంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని కలెక్టర్ వివరించారు. భారీ పరిశ్రమలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు, సిమెంట్ పరిశ్రమల విస్తరణ వంటి పెట్టుబడులతో జిల్లాలో పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని, తద్వారా ఉపాధి, ఆర్థిక అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు.

# స్థానికంలో బీసీ రిజర్వేషన్లు లేనట్లే..?

ఉండదని అంటున్నారు. అయితే ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 23.84 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీ జనాభాకు తగినట్లు మరో 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచడానికి మాత్రమే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 50.26 శాతం కాగా, ఆ లెక్కన 27.66 శాతం వరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడానికి సమస్య ఉండదని అంటున్నారు. అయితే ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు. ఎన్నికల హామీ అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సివుంటుంది. ఇందుకు కుల గణన జరగాలి. దేశంలో 1931 తర్వాత ఎక్కడా కుల గణన చేయలేదని అంటున్నారు. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, ఈ ప్రక్రియ ముగియడానికి మరో ఏడాది పడుతుందని భావిస్తున్నారు. అయితే వచ్చేనెల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై విస్తృతంగా సమాలోచనలు చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తోందని చెబుతున్నారు.

# రైతు ఆర్థిక భద్రతే లక్ష్యం

ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి బీమా నమోదులో సుమారు 80 శాతం వృద్ధి నమోదైందని, ముఖ్యంగా రుణాలు తీసుకుని రైతులు బీమా పరిధిలోకి రావడం గణనీయంగా పెరిగిందని చెప్పారు. గతంలో రుణాలు తీసుకోని రైతుల నమోదు సుమారు 2 లక్షలు ఉండగా, ఖరీఫ్--2026లో అది ఏకంగా 20.35 లక్షలకు చేరడం ద్వారా బీమా పథకం గ్రామీణ స్థాయిలో ఎంత విస్తృతంగా చేరిందో స్పష్టమవుతోందన్నారు. పంట నష్టపోయిన సమయంలో రైతు కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా, తిరిగి సాగు ప్రారంభించేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడమే బీమా పథకం ఉద్దేశమని మంత్రి వివరించారు. పంటల బీమా విస్తీర్ణం కూడా ఈ ఏడాది భారీగా పెరిగిందని అచ్చెన్నాయుడు తెలిపారు. గత ఖరీఫ్‌లో 7.83 లక్షల హెక్టార్లుగా ఉన్న బీమా విస్తీర్ణం ఖరీఫ్--2026లో 15.17 లక్షల హెక్టార్లకు చేరిందని, ఇది సుమారు 94 శాతం వృద్ధి అని వెల్లడించారు. బీమా విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఐదో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈసారి రైతుల పంటలకు మొత్తం రూ.13,983 కోట్ల మేర బీమా మొత్తం వర్తించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడి రైతులకు ప్రత్యేక రక్షణ కల్పించడంపై వ్యవసాయ శాఖ దృష్టి సారించిందన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలతో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని అచ్చెన్నాయుడు తెలిపారు.

# చిట్టీల పేరుతో రూ.70 లక్షల మోసం?

లక్షల మేర మోసం జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. గత 20 ఏళ్లుగా చిట్టీలు నిర్వహిస్తున్న దంపతులు.. పేదలు కష్టపడి దాచుకున్న డబ్బులను ఎగ్గొట్టి ఇల్లు ఖాళీ చేసి పారిపోయేందుకు ప్రయత్నించారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వారిని బాధితులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రోడ్డు పక్కన చేపలు అమ్ముకునే వారు, ఇళ్లలో పనిచేసే వారు, ఇతర రోజువారీ కూలీలు, పేద కుటుంబాలే ఈ చిట్టీలకు ప్రధానంగా డబ్బులు చెల్లించినట్లు బాధితులు చెబుతున్నారు. ఎన్నో ఏళ్లుగా నమ్మకంగా చిట్టీలు నిర్వహిస్తూ తమ నుంచి డబ్బులు వసూలు చేశారని, ఇప్పుడు చిట్టీ డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. చిట్టీ డబ్బులు అడిగిన సమయంలో నిర్వాహకుల కుటుంబ సభ్యులు తమతో గొడవకు దిగేవారని బాధితులు తెలిపారు. తమకు జరిగిన మోసంపై సుమారు 15 రోజుల క్రితమే గుడివాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తాజాగా నిర్వాహకులు ఇల్లు ఖాళీ చేసి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో వారిని అడ్డుకున్నామని బాధితులు తెలిపారు. తమ వద్ద నుంచి సేకరించిన చిట్టీ డబ్బులతో శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల్లో ఆస్తులు కొనుగోలు చేసినట్లు సమాచారం ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. చిట్టీల పేరుతో పేదల నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించి మోసం చేశారనే ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

# బెల్జియంలో డ్రైనేజీ పనులు చేస్తుంటే.. గోడలో బయటపడ్డ రూ.98 కోట్ల నిధి!

వివరాల్లోకి వెళితే.. కోబీ అనే 18 ఏళ్ల యువకుడు వేసవి సెలవుల్లో భాగంగా ఓ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నాడు. చారిత్రక 'బ్రౌవర్‌షుయిస్' భవనంలో మురుగునీటి పైపుల కోసం తవ్వుతుండగా, ఓ సెల్లార్‌లో ఇటుకలతో మూసేసిన గోడను గమనించాడు. దాన్ని పగలగొట్టి చూడగా లోపల ఓ సంచి కనిపించింది. మొదట యూరో నాణేలు అనుకున్నప్పటికీ, తెరిచి చూసి షాక్‌కు గురయ్యాడు. అందులో బంగారంతో తయారైన కడ్డీలు, నాణేలు, ముక్కలు భారీగా ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగానే దీన్ని ఇక్కడ దాచిపెట్టినట్లు అనిపించిందని కోబీ తెలిపాడు. ఈ బంగారం దొరికిన భవనాన్ని 19వ శతాబ్దంలో థియోఫిలస్ వాన్ ఆస్చే అనే బ్రూవరీ యజమాని నిర్మించారు. ప్రస్తుతం ఓ స్వచ్ఛంద సంస్థ దీనిని పునరుద్ధరిస్తోంది. ఈ సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, నిధిని స్వాధీనం చేసుకుని సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీనికి నేర చరిత్ర ఏమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. బెల్జియం చట్టాల ప్రకారం, ఇలాంటి నిధులు దొరికితే అసలు యజమానుల కోసం ఐదేళ్ల పాటు వేచి చూడాలి. ఈ నిధిపై కాంట్రాక్టర్లు, భవన యజమాని వారసులు హక్కుల కోసం పోటీపడే అవకాశం ఉంది. ప్రస్తుతానికి చట్ట ప్రకారం నిధిని ప్రభుత్వానికి అప్పగించినా, భవిష్యత్తులో తనకు రివార్డు లభించవచ్చని కోబీ ఆశాభావం వ్యక్తం చేశాడు.

# చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం

అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

# బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

భాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరయ్యారు. వేడుకలో బండ్ల గణేశ్ కుటుంబసభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేసి సందడి చేశారు. వారంతా నూతన దంపతులను అభినందించి, ఆశీర్వదించారు. ప్రముఖుల రాకతో వివాహ ప్రాంగణం కోలాహలంగా మారింది. బండ్ల గణేశ్ ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తూ కనిపించారు.

# హసీనాను అప్పగిస్తేనే బంగ్లాదేశ్ ప్రధాని భారత్ పర్యటన

తెలిసిందే. అనంతరం ఆమెపై తన హయాంలో బంగ్లాదేశ్ లో ప్రజలు, విద్యార్థుల పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారనే నేరారోపణలు రుజువై మరణశిక్ష పడింది. దీంతో ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ భారత్‌ను కోరుతోంది. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా ఓ మీడియా సమావేశంలో హసీనా పాల్గొని మాట్లాడటంపై ఢాకా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భారత్‌లో ఉంటూ ఆమె చేసే వ్యాఖ్యలు రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల చర్చలను దెబ్బతీస్తున్నాయని బంగ్లాదేశ్ విదేశాంగ ప్రతినిధి ఎ.కె.ఎమ్. షాహిదుల్ కరీమ్ వ్యాఖ్యానించారు. తమ దేశ సార్వభౌమాధికారం, పరస్పర గౌరవంతో కూడిన 'బంగ్లాదేశ్ ఫస్ట్' విదేశాంగ విధానాన్ని తాము ముందుకు తీసుకెళ్తామని బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తారిఖ్ రెహ్మాన్.. సాధారణంగా బంగ్లాదేశ్ నాయకులు తమ తొలి విదేశీ పర్యటనగా భారత్‌ను ఎంచుకునే సాంప్రదాయానికి భిన్నంగా మలేషియా, చైనాలలో పర్యటించారు. మరోవైపు, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హసీనా అప్పగింత విజ్ఞప్తిని పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ పేర్కొంది.

# విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'.. వైసీపీపై ఫైర్

పాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# రేపటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు..

తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

**మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: జగన్**

అసెంబ్లీని బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పాలని వైసీపీ నిర్ణయించింది. పార్టీ శాసనసభ్యులతో ఇటీవల సమావేశమైన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, ఈ మేరకు ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే చంద్రబాబు ప్రభుత్వం తమకు ఎల్‌ఓపీ హోదా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మండలిలో పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించారు. మెగా డీఎస్సీ-2025పై చర్చించాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయాలని పార్టీ సభ్యులకు సూచించారు. దాదాపు 13 త్రైమాసికాలుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.3,300 కోట్లను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ అంశాలను కూడా మండలిలో బలంగా ప్రస్తావించాలని జగన్ స్పష్టం చేశారు. దీంతో, అసెంబ్లీలో చర్చ ప్రశాంతంగా సాగినా, శాసనమండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య వాడివేడి వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

### "గాయపడిన యువకుడికి ఆర్థిక సాయం అందజేసిన

# వైసీపీ ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడు"



పెంటపాడు ఆగస్టు 16 (నేటి- శుభోదయ): పెంటపాడు 11వ వార్డు కూనాగరపేటకు చెందిన ముదుర్ని మహిమరాజు ఇటీవల బైక్ ప్రమాదం జరిగి చెయ్యికి ప్యాక్చర్ అయింది. ఈ విషయం 11వ వార్డు పంచాయితీ మాజీ వార్డ్ మెంబర్ మారంపూడి ఏసుదాసు ఈ విషయం రఘురాం నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి ఆ కుటుంబానికి వెళ్లి పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలకు ఎవరికి అన్యాయం జరిగిన నేను ముందుంటానని ప్రతి ఒక్కరు పార్టీకి కట్టుబడి పనిచేయాలని రాబోయే రోజులలో మనఅందరం కలిసికట్టుగా పనిచేసి వైసిపి విజయం కోసం కృషి చేయాలని ఆయన కోరారు. మహిమరాజు వైద్య మందుల నిమిత్తం ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారంగా ఈరోజు సోమవారం మందులు నిమిత్తం 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం పంపించారు. ఆ అమౌంట్ ని పెంటపాడు వైసిపి నాయకులు చేతుల మీదుగా ఆ కుటుంబానికి సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, పెంటపాడు గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు బర్ల జయ రాంబాబు, 11వ వార్డు మాజీ మెంబర్ మారంపూడి ఏసుదాసు, కర్రి శివారెడ్డి, నల్లిమిల్లి అప్పిరెడ్డి, మొఖమట్ల శ్రీనివాస్, ఉంగ్రాజవరపు రాజు, చదలవాడ శ్రీనివాస్, తానేటి కుమార్ రాజా, దూలపల్లి నేతిబాబు తదితరులు పాల్గొన్నారు.

# "పేదల ఆశాజ్యోతి బొలిశెట్టి జనసేన నేత వెంకటరామయ్య"



తాడేపల్లిగూడెం ఆగస్టు 16 (నేటి –శుభోదయ) పేదల సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసే నాయకుడు బొలిశెట్టి శ్రీనివాస్ అని జనసేన నేత పైబోయిన వెంకటరామయ్య పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని భగత్ సింగ్ కాలనీలో ఆదివారం బొలిశెట్టి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని 300 మంది పేద మహిళలకు ప్రీమియం చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పైపోయిన వెంకటరామయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మార్గదర్శకంలో తాము కూడా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని బొలిశెట్టి ఒక ఎమ్మెల్యేగా కాకుండా నిజమైన ప్రజా సేవకుడిలా నియోజకవర్గ అభివృద్ధిలో పేదలకు ఆపదలో అండగా నిలిచే మహానేతగా ఇది గారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయాల్లో మరింత రాణించి ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం సొసైటీ అధ్యక్షుడు సిద్దా వీర్రాజు, జనసేన నాయకులు చాపల రమేష్, కాళ్ల గోపికృష్ణ, సింగం సుబ్బారావు, కర్రి సురేష్, షేక్ పటాన్ వల్లి, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు



అనంతపురం బ్యూరో ఆగస్ట్16 నేటి శుభోదయ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రంపేట బైపాస్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈడీ బీసీ కార్పొరేషన్ అధికారి సుబ్రమణ్యం , బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, కుల సంఘాల నాయకులు పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్న గారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ఖుష్బూ కొఠారి మాట్లాడుతూ, సర్దార్ గౌతు లచ్చన్న గారి ఆశయాలు, సామాజిక సేవా స్ఫూర్తిని నేటి యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక




విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయం): ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి



**- ఆగస్టు 17వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ**

**-సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..**

**- రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి**

**- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

అనంతపురం బ్యూరో ఆగస్టు 16 నేటి శుభోదయ : మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.ఆగస్టు 17వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :ఆగస్టు 17వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌డేను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

# శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో ఘనంగా ముగిసిన 'వరుణ యాగాలు'



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): లోకకల్యాణార్థం, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను నివారించి సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలనే సంకల్పంతో ఇంద్రకీలాద్రిపై మూడు రోజులుగా నిర్వహించిన త్రయాహ్నిక "వరుణ యాగములు, వరుణ జపములు" ఆదివారం మహా పూర్ణాహుతితో విజయవంతంగా ముగిశాయి. నదులు, చెరువులు, జలాశయాలు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సమున్నత లక్ష్యంతో ఆలయ ఈ.ఓ సీనా నాయక్ పర్యవేక్షణలో, వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చక స్వాములు ఈ పవిత్ర క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వరుణ యాగా ముగింపు ఉత్సవాలలో ఆలయ వేదపాఠశాల విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దుర్గాఘాట్ నుండి పవిత్ర కృష్ణానదీ జలాల ఘటాలను భక్తిపూర్వకంగా తలపై ధరించి, క్రమశిక్షణతో ఇంద్రకీలాద్రిపైకి ఊరేగింపుగా తీసుకువచ్చిన దృశ్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థుల వేద మంత్రోచ్ఛారణలు, సాంప్రదాయ దుస్తుల అలంకరణ ఈ యాగ క్రతువుకు మరింత ఆధ్యాత్మిక శోభను చేకూర్చాయి. మూడవ రోజు ఉదయం 06:30 గంటలకు దుర్గాఘాట్ వద్ద అర్చక స్వాములు, వేద పండితులు, వేదపాఠశాల విద్యార్థుల మంత్రోచ్ఛారణల మధ్య పవిత్ర కృష్ణానదీ జలాలను ఘటాలలోకి సేకరించారు. పవిత్ర నదీ జలాలతో కూడిన ఘటాలను విద్యార్థులు, అర్చకులు శిరస్సుపై ధరించి మంగళవాయిద్యాలు, వేద ఘోషల మధ్య ఇంద్రకీలాద్రిపైకి భక్తిపూర్వకంగా ఊరేగింపుగా తీసుకువచ్చారు.మహాన్యాస పారాయణము: ఉదయం 07:00 గంటలకు శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో శివనామ స్మరణతో మహాన్యాస పారాయణమును వైభవంగా ప్రారంభించారు. ఉదయం 07:30 గంటల నుండి శ్రీ మల్లేశ్వర స్వామి వారికి కృష్ణానదీ జలాలతో భక్తిశ్రద్ధలతో "ఘటాభిషేకం" నిర్వహించారు. అనంతరం శత అనువాహక, కారక పారాయణాలు, మండప దేవతా హోమములు, జయాదులను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు.మహా పూర్ణాహుతి: ఉదయం 10:30 గంటలకు పాత యాగశాల వద్ద వేద పండితుల మంత్రోచ్ఛారణలు, కర్పూర హారతుల మధ్య అత్యంత వైభవంగా "మహా పూర్ణాహుతి" కార్యక్రమాన్ని నిర్వహించడంతో ఈ వరుణ యాగా ఉత్సవాలు భక్తి ప్రపత్తులతో సంపూర్ణమయ్యాయి.ఈ ముగింపు వేడుకలలో ఆలయ ఈ.ఓ వి.కె.శినా నాయక్, స్థానాచార్యులు వి. శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్ శర్మ, ఇతర వైదిక కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో అర్చక స్వాములు భక్తిశ్రద్ధలతో పాల్గొని యాగ క్రతువులను విజయవంతం చేశారు.ఈ యాగ ఫలంతో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ, మల్లేశ్వర స్వామి వార్ల కృపాకటాక్షాలతో రాష్ట్రవ్యాప్తంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పండి, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లుతారని ఆలయ అధికారులు, వైదిక కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

# గౌతు లచ్చన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలి



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): గౌతు లచ్చన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ ఏ రవీంద్రరావు అన్నారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఆదివారం ఉదయం గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా అడిషనల్ కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు సిబ్బందితో కలిసి గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు మాట్లాడుతూ, గౌతు లచ్చన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత నాయకుడని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సమానత్వం, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. గౌతు లచ్చన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రజా సేవలో అంకితభావం, పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాన్ని పాటించాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొని గౌతు లచ్చన్నకు ఘన నివాళులర్పించారు.

# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఘాట్ రోడ్, క్యూ లైన్లునిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విఐపి దర్శనాలు, అంతరాలయ దర్శనాలు ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 3 గంటల వరకు దర్శనాలను నిలిపివేసారు. కొండపైకి వచ్చే వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక వాహనాలను బ్యాటరీ వెహికల్స్ వీల్ చైర్స్ ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో వేచి ఉండే భక్తులకు తాగునీరు, పాలు, మజ్జిగ పంపిణీ చేశారు. దర్శన సమయాన్ని పొడిగించడంతో పాటు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు రద్దీ నేపథ్యంలో ఆలయ చైర్మన్ రాధాకృష్ణ గాంధీ, ఈఓ శీనా నాయక్ క్యూ లైన్లను పరిశీలించి భక్తులతో మాట్లాడి, అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా విజయవాడ పోలీసులు ఘాట్ రోడ్ పరిసరాల్లో అదనపు భద్రతను ఏర్పాటు చేశారు.

# ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): విజయవాడ నగరంలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ నిబంధనలపై ప్రజలు, వ్యాపార సంస్థల సిబ్బందికి అవగాహన కల్పించడంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ సిహెచ్ రత్నబాబు ఆధ్వర్యంలో ఆదివారం టిప్పీ టాప్పీ షోరూమ్‌లో ఫైర్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారులు షోరూమ్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాల వినియోగం, అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో సురక్షితంగా బయటకు వెళ్లే విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, అవి పనిచేసే స్థితిలో ఉండేలా తగిన నిర్వహణ చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు, సిబ్బంది సులభంగా బయటకు వెళ్లేందుకు అత్యవసర నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా గుర్తించే సూచిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. అత్యవసర నిష్క్రమణ మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో ఆందోళనకు గురికాకుండా, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని అధికారులు సూచించారు. షోరూమ్‌లో పనిచేసే సిబ్బందికి అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలో ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు.

నగరంలోని వాణిజ్య సముదాయాలు, షోరూమ్‌లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ఇతర ప్రజా వినియోగ ప్రదేశాల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఫైర్ విభాగం అధికారులు తెలిపారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఫైర్ సిబ్బంది, టిప్పీ టాప్పీ షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న

# ప్రముఖ నిర్మాత కొణిదెల నిహారిక



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): ప్రముఖ చలనచిత్ర నిర్మాత కొణిదెల నిహారిక శ్రీ కనకదుర్గమ్మ వారి దర్శనానికి ఆదివారం ఆలయానికి విచ్చేసారు. అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

# యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

**- యువతతోనే సమాజ మార్పు : సిపిఐ నేత బాగం**
**- చింతల వినయ్ నేతృత్వంలో వందలాది మంది సిపిఐలో చేరిక**
**- పార్టీ జెండా కప్పి సాదరంగా ఆహ్వానించిన నేతలు**







ఖమ్మం, నేటి శుభోదయ : దేశ జనాభాలో సగ భాగానికి పైగా కలిగిన యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. ఉద్యోగ, ఉపాధి రంగాలలో నిర్లక్ష్యం వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆదివారం చింతల వినయ్ ఆధ్వర్యంలో వందలాది మంది యువకులు సిపిఐలో చేరారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి ఖానాపురం హవేలీ నాల్గవ డివిజన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపురం హవేలీ సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ పాలకులు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని ముఖ్యంగా ఉపాధి కల్పన రంగాలపై వివక్ష ప్రదర్శిస్తున్నారన్నారు. -నైపుణ్యత కలిగిన యువతకు సైతం ఉపాధి దొరకడం లేదని నైపుణ్యత లేని వారు ఏదో ఒక రకంగా ఉపాధి పొందెందుకు ప్రయత్నిస్తుంటే పాలకులు రకరకాల చట్టాలతో బతక లేని పరిస్థితిని సృష్టిస్తున్నారని హేమంతరావు తెలిపారు. మోడీ -అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా యావత్ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టి -దేశాన్ని ప్రైవేటీకరణ వైపు పరుగులు పెట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనకు ఎదురు లేదనుకుంటున్న మోడీని ఈ దేశ -యువశక్తి మెడలు వంచిందని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన పోరాటంతో మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదని ఆయన తెలిపారు. రాజకీయాల్లో అవినీతిపై యువత భగ్గుమంటున్న సమయంలో యువతకు -మద్దతుగా నిలుస్తూ యువజన పోరాటాల్లో పాలుపంచుకున్న సిపిఐలో యువకులు చేరడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని హేమంతరావు తెలిపారు. ముఖ్యంగా నిరుద్యోగ -భృతి, ఉద్యోగాల కల్పన విషయంలో ఆడిన మాట తప్పిందని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అనేక డిక్లరేషన్లు ఇచ్చిందని ఏ డిక్లరేషన్ను అమలు చేసే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన అనేక పోరాటాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేస్తున్న సిపిఐ ఇటీవల జన చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజా ఉద్యమాలకు నూతన జవసత్వాలను తీసుకు వచ్చిందన్నారు. చింతల వినయ్ సహా పార్టీలో చేరిన -వారందరిని సిపిఐ సగర్వంగా ఆహ్వానిస్తుందని హేమంతరావు తెలిపారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు ప్రసంగించగా ఆహుతులను హవేలీ సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల -మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాపనేని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్, విజయ్, రాకేష్, పవన్, రాజు, కిషోర్, కిరణ్, రంజిత్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి సిపిఐలోకి ఆహ్వానించారు.

# శ్రీ జగన్మాత ను దర్శించుకున్న ఏపీ రాష్ట్ర డీజీపీ



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానాన్ని ఆదివారం సందర్శించి, శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన డీజీపీ కి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈఓ వి.కె. సీనా నాయక్ సాంప్రదాయ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. డీజీపీ కి అమ్మవారి ఆశీర్వాద మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. చైర్మన్, ఈఓ కలిసి డీజీపీ కి అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రం, లడ్డు ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, భక్తుల కోసం చేసిన క్యూలైన్ల నిర్వహణను అభినందించారు. సాధారణ భక్తులకు కూడా సులువైన, ప్రశాంతమైన దర్శనం కల్పించేలా చైర్మన్, ఈఓ లు తీసుకుంటున్న చర్యలపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, బోర్డు సభ్యులు, ఉన్నత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సముద్రంలో గల్లంతు అయిన మత్స్యకారుడి మృతదేహం లభ్యం



మచిలీపట్నం, ఆగస్టు 16 నేటి శుభోదయ : సముద్రంలో గల్లంతైన యువ మత్స్యకారుడి మృతదేహం లభ్యమైంది. మంగినపూడి బీచ్ నుంచి వేటకు వెళ్లిన పల్లెటి రాజు (20) నిన్న సముద్రంలో గల్లంతయ్యాడు. రాజు కోసం స్థానిక మత్స్యకారులు, మెరైన్ పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సత్రంపాలెం గ్రామ పరిసరాల్లో సముద్ర తీరానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో రాజు మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చేందుకు పోలీసులు, మత్స్యకారులు చర్యలు చేపట్టారు. రాజు మృతితో తాళ్లపాలెం వైఎస్ఆర్ ఫిషర్‌మెన్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్న వయసులోనే మత్స్యకారుడి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాజు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించడంతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

# లీగల్ సెల్ న్యాయవాదులతో సమస్యల పై చర్చిస్తున్న..!

**- గాజువాక నియోజకవర్గం ఇంచార్జ్ తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి**



విశాఖపట్నం నేటి శుభోదయ ఆగస్టు :16 గాజువాక నియోజకవర్గం ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి జిల్లా లీగల్ సెల్ అధ్యక్ష కార్యదర్శులు బాజీ నాయుడు హైకోర్టు న్యాయవాది అండి బోయిన లక్ష్మి ఆధ్వర్యంలో గాజువాక నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన గిల్బర్ట్ను శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గాజువాక నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా ఆరోపణలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్న పరిస్థితుల్లో, వారికి న్యాయపరమైన సహాయం అందించి, చట్టపరంగా ఎలా రక్షణ కల్పించాలనే అంశంపై చర్చ జరిగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి న్యాయపరమైన సమస్య ఎదురైనా లీగల్ సెల్ ద్వారా తగిన న్యాయ సహాయం అందించాలని ఈ సందర్భంగా తెలియజేశారు ప్రజాస్వామ్య పద్ధతిలో, చట్టపరమైన పరిధిలోనే సమస్యలను ఎదుర్కొంటూ పార్టీ శ్రేణులకు అండగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాత వి బాగా అధ్యక్షులుఅండి బోయిన అప్పారావు పాక సత్యనారాయణ శ్రీనివాస్ అనిల్ సంతోష్ లక్ష్మణ్ రమణ లీగల్ సెల్ రాష్ట్ర, జిల్లా మరియు నియోజకవర్గ , న్యాయవాదులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత సర్దార్ గౌతు లచ్చన్న

**- బాపట్లలో గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు**



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) ఆగస్ట్ 16 : బాపట్ల: స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత సర్దార్ గౌతు లచ్చన్న గారి 117వ జయంతి వేడుకల్లో బాపట్ల నియోజకవర్గ శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. బాపట్ల పట్టణంలోని చీలు రోడ్డులో ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న గారి విగ్రహం వద్ద బీసీ వెల్ఫేర్ అసోసియేషన్, బాపట్ల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పాల్గొని, లచ్చన్న గారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, బడుగు బలహీన వర్గాల గొంతుకగా సర్దార్ గౌతు లచ్చన్న గారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. పేదలు, రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని తెలిపారు. చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన ధైర్యశాలి లచ్చన్న గారని కొనియాడారు. అంటరానితనం, కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించేందుకు ఆయన విశేష కృషి చేశారని చెప్పారు. రాజకీయ పదవులను అధికారానికి మార్గంగా కాకుండా ప్రజాసేవకు సాధనంగా భావించిన గొప్ప ప్రజానాయకుడు లచ్చన్న గారని, 95 ఏళ్ల వయస్సులోనూ ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రజల కోసం సేవ చేసిన మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం సర్దార్ గౌతు లచ్చన్న గారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ద్వారా ఆయన సేవలకు, ఆశయాలకు ఇస్తున్న గౌరవాన్ని చాటుతోందని అన్నారు. బాపట్లలో లచ్చన్న గారి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా, ఆయన చరిత్రను భావితరాలకు పరిచయం చేసేలా ప్రతి సంవత్సరం జయంతి కార్యక్రమాలను నిర్వహించడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే లచ్చన్న గారికి మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న గారి స్ఫూర్తితో బాపట్ల నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నామని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జయప్రకాశ్, రమేష్, రామారావు, బాల కోటేశ్వరరావు, కృష్ణ, శేఖర్, చినబాబు, వెంకట నారాయణ, చలమయ్య, మురళి తదితర బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నుండి నిధులు మేము తెస్తాం అభివృద్ధి మీరు చేయండి- ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): రాష్ట్రంలో ప్రధానమైన ఆలయాల్లో ఒకటిగా పేరుగాంచిన జగ్గయ్యపేట నియోజకవర్గ పెనుగంచిప్రోలు ప్రాంతంలోని శ్రీ తిరుపతమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమ అభినందన సభ కు విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్, స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ పాలకమండలి సభ్యులు బాధ్యతలు స్వీకరించి పని అయిపోయిందని అనుకోకుండా ఆలయ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఆలయం మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు సహాయ సహకారాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉండి కృషి చేస్తానని ఎంపీ తెలియజేశారు ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారంతో కూడా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని అందరూ కలిసికట్టుగా ఉండి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు

ఆలయ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిని తీసుకొచ్చి సమస్యలు అన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా కృషి చేస్తానని తెలిపారు తిరుపతమ్మ ఆలయానికి ఉన్న ఆధ్యాత్మిక చారిత్రాత్మక ప్రాధాన్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఎంపీ సూచించారు. ప్రసాద్ పదకం ద్వారా కూడా నిధులు వచ్చే విధంగా కృషి చేస్తానని ఇప్పటికే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆధ్యాత్మిక టూరిజం బాగా అభివృద్ధి చెందిందని రాబోయే రోజుల్లో దీన్ని మరింతగా ముందుకు తీసుకువెళ్లే దిశగా ఆలయ పాలకమండలి కృషి చేయాలని జగ్గయ్యపేట ఎల్లప్పుడూ ఒక ప్రత్యేకమైన నియోజకవర్గమని రాబోయే రోజుల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో న్యాయం చేస్తామని కూటమినేతలంతా కలిసికట్టుగా ఉండి ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఎంపీ చిన్ని తెలియజేశారు మరి ముఖ్యంగా తిరుపతమ్మ ఆలయాన్ని ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని ఆలయ చైర్మన్ మరియు పాలక మండలి ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, తిరుపతమ్మ ఆలయ చైర్మన్ చుంచు రమేష్, జగ్గయ్యపేట రూరల్ మండల పార్టీ ప్రెసిడెంట్ కట్ట వెంకట నరసింహారావు, పెనుగంచిప్రోలు పార్టీ ప్రెసిడెంట్ చింతల సీతారామయ్య, జనసేన నాయకులు షౌకత్ అలీ, బిజెపి నాయకురాలు కల్లూరి శ్రీవాణి, జగ్గయ్యపేట సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరామ్ చినబాబు పార్టీ సీనియర్ నాయకులు వేగినేటి గోపాలకృష్ణమూర్తి, నలమోతు శివరామ ప్రసాద్, వెంకటనారాయణ, కృష్ణమూర్తి,సుధీర్ బాబు, పొన్నం బాలాజీ వెంకటేష్, కూటమి నాయకులు తిరుపతమ్మ ఆలయ పాలకవర్గ సభ్యులు, డిసి చైర్మన్లు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# "ఫెలిసిటేషన్ సెర్మని"కార్యక్రమం "

**- ఆలిండియా వీరశైవ లింగాయత్ మహాసభ"**

**- లింగాయత్ మహాసభకు హాజరైన లింగాయత్ లింగ బలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ తుల్జాపూర్ స్వప్న**






అనంత పురం బ్యూరో ఆగస్టు 16 నేటి శుభోదయ: ఆల్ ఇండియా వీరశైవ లింగాయత్ మహాసభ, ఫెలిసిటేషన్ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న మహారాష్ట్ర అధ్యక్షులు, మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే విశ్వనాథ్ బాబురావు చకోటి కి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి ఆలిండియా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు, మంత్రి ఈశ్వర్ కంద్రే కి అతిథిగా విచ్చేసిన తుల్జాపూర్ స్వప్న, చైర్ పర్సన్,ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్/లింగ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం మన వీరశైవ లింగాయతుల ముద్దుబిడ్డ, మెంబర్ అఫ్ పార్లమెంట్, ప్రభాకర్ జి కోర్ కి "పద్మశ్రీ అవార్డు ను'' గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి అందజేశారు అందువలన మన వీరశైవ లింగాయతులు ''వీరశైవ రత్న అవార్డును" ఈ కార్యక్రమం నందు అందజేశారు. అరవింద్ జి సాహెబ్ కూడా బసవ రత్న"అవార్డును అందజేశారు, అమిత్ జి కళ్యాణి శ్రీ గహిని నాథ్ మహారాజ్ ఔసేఖర్ ని కూడా సత్కరించారు. మన మహానుభావుడు జగ జ్యోతి శ్రీశ్రీశ్రీ బసవన్న మనకు కేవలం ఒక ఆధ్యాత్మిక మార్గాన్ని మాత్రమే చూపించలేదు. మానవత్వం, కాయకం, దాసోహం, మానవత్వం, స్త్రీ–పురుష సమానత్వం వంటి గొప్ప విలువలను సమాజానికి అందించారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు ఆల్ ఇండియా వీరశైవ లింగాయత్ సమాజం చైర్మన్లు కమిటీ మెంబర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



# పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి గారి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా

బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) ఆగస్టు 16 : గుంటూరు లో మొదటిరోజు జరిగినటువంటి ప్రోగ్రాంలో మెగా సీనియర్ అభిమాని బాపట్ల నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్ గారికి చిరు బీమా సత్కారం అందించిన అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రావణం స్వామి నాయుడు తోటకూర రమణారావు రమాదేవి మేకల రవీంద్ర బాబు జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాజీ శాసనసభ్యులు జనసేన పార్టీ నాయకులు కిలారి వెంకట రోశయ్య టిడిపి నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య మెగా యూత్ ఫోర్స్ గుంటూరు జిల్లా అధ్యక్షులు చింత శివ ఆంధ్రప్రదేశ్ కో కన్వీనర్ మెగా విత్ ఫోర్స్ వల్లూరి అనిల్ కుమార్ పాకనాటి రమాదేవి పార్వతి నాయుడు ఈ కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ తదితరులు పాల్గొన్నారు.

**సెలవు రోజుల్లో పిల్లలు ఏమి చేస్తున్నారో**

# తల్లిదండ్రులు గమనిస్తుండాలి

**- ప్రమాదంలో మరణించిన ఒకొక్క కుటుంబానికి రూ.10 వేలు అందచేసిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన రోజుల్లో పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, ఏమి చేస్తున్నారనే విషయాలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సూచించారు. తూర్పులోని కృష్ణలంక మెట్ల బజారు, పద్మావతి ఘాట్ దగ్గర శనివారం కృష్ణానదిలోకి దిగి మరణించిన ముగ్గురు పిల్లల మృతదేహాలను ఎమ్మెల్యే గద్దె ఆదివారం పరామర్శించారు. తిగుళ్ళ తేజ, గడ్డం జాషువా, వీసాం గౌతమ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.30 వేలను వారికి అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణా నదిలో దిగి ముగ్గురు బాలురు మరణించడం చాలా బాధాకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల పాఠశాలలకు సెలవులు ప్రకటించిన రోజుల్లో పిల్లలు 'ఎక్కడికి వెళుతున్నారు?', 'వారు ఏమీ చేస్తున్నారు?' అనే విషయాలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని చెప్పారు. మరణించిన పిల్లల కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని గద్దె అన్నారు. ఈ కార్యక్రమములో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ,గల్లా శ్రీను, కోలుకొండ రామమోహనరావు, గల్లా సుబ్బారావు, ఒడుగు రాజేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

# చిట్టీల పేరుతో రూ.70 లక్షలకు టోకరా

గుడివాడ, ఆగస్టు 16 నేటి శుభోదయ : చేపలు అమ్ముకుని జీవనం సాగించే ఓ కుటుంబం పేదల నుంచి మహిళ చిట్టీలు వేయించి, పాడినా తిరిగి చెల్లించకుండా అదృశ్యమైందని తెలిసి బాధితులు గగ్గోలు పెడుతున్నారు. కొందరు బాధితులు గుడివాడ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గుడివాడ ఎన్టీఆర్ కాలనీలో ఓ మహిళ, ఆమె భర్త గత 20 ఏళ్లుగా చిట్టీలు నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంగా ప్రజలు చిట్టీ పాడినా నగదు ఇవ్వడం లేదని, చిట్టీ నగదు ఇస్తానన్న గడువు ముగిసినా చెల్లించకుండా పేదలను రేపు మాపు అంటూ తిప్పుతూ కాలయాపన చేస్తున్నారు. వడ్డీతో సహా ఇస్తానని తొలుత రెండు మూడు నెలల వడ్డీ చెల్లించి తర్వాత ఎగవేస్తున్నారు. ఓ మహిళకు చిట్టీల నగదు, ఆమె నుంచి వడ్డీకి ఇస్తానని తీసు కున్న నగదు రూ.10 లక్షలు ఉంది. బంటుమిల్లి రోడ్డులో చేపలు అమ్ము కుంటూ జీవనం సాగించే ఓ ఒంటరి మహిళ కుమార్తె పెళ్లి కోసం సుమారు రూ.4 లక్షలకు చిట్టీ వేశారు. గ్యాస్ సిలిండర్లు ఇంటింటికీ చేర వేసే ఓ వ్యక్తికి రూ.3 లక్షలు చెల్లించలేదు. ఓ ఐదుగురు బాదితులు తమకు సుమారు రూ.22 లక్షలకు పైగా చెల్లించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు మహిళ భర్త ఇల్లు అమ్మి చెల్లిస్తామంటూ బాధి తులతో నమ్మబలుకుతున్నారు. ఈ ఇల్లు అమ్మినా చెల్లించడానికి సరి పోదని బాధితులు తీవ్ర వేదన చెందుతున్నారు. సదరు చిట్టీల నిర్వా హకురాలు విశాఖలో ఓ అపార్ట్మెంటు కొన్నట్లు, విజయనగరం, శ్రీకా కుళం జిల్లాలోని వారి బంధువుల ఇళ్ల వద్ద నగదు దాచారని సమా చారం. ఈవిషయంపై గుడివాడ వన్ టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ ను వివరణ కోరగా తమ వద్దకు చిట్టీ బాధితులు కొందరే రాగా, అందరూ కలిసి వచ్చి ఫిర్యాదు ఇవ్వాలని కోరామన్నారు. చిట్టీల నిర్వాహకులు బాధితులకు నగదు ఇచ్చేస్తామని, కొంత సమయం అడిగారని తెలిసిం దన్నారు. ఎవరు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేస్తామన్నారు.

# ఘనంగా ఏపీజీఈఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



విజయవాడ, ఆగస్టు 16 నేటి శుభోదయ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 16 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర, జిల్లా, నగర శాఖల ప్రతినిధులు మరియు సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి, అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, హక్కులు మరియు సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల సమస్యలపై సమర్థవంతంగా పోరాడేందుకు అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ కె.ఆర్. సూర్యనారాయణ నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో మరింత కీలక పాత్ర పోషించాలని పలువురు నాయకులు, సభ్యులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగ సాయి మాట్లాడుతూ, సంఘం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పామర్తి లీలావతి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగినుల సమస్యలను పరిష్కరించడంతో పాటు మహిళా ఉద్యోగులకు సమాన అవకాశాలు, గౌరవం మరియు భద్రత కల్పించే దిశగా సంఘం మరింత చురుకుగా పనిచేయాలని అన్నారు. మహిళా ఉద్యోగులందరూ సంఘ కార్యకలాపాల్లో చురుకైన భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి కే. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల ఐక్యతే సంఘానికి ప్రధాన బలమని, సభ్యులందరూ సమన్వయంతో పనిచేస్తే మరిన్ని విజయాలను సాధించవచ్చని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు భైరి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ఉద్యోగుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి రాష్ట్ర సంఘంతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తామని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా, నగర శాఖల నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. "ఉద్యోగుల ఐక్యత -- సంఘం బలోపేతం -- హక్కుల పరిరక్షణ" అనే లక్ష్యంతో ఏపీజీఈఏ మరింత శక్తివంతంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు గాయత్రి, రేణుక, సుధ, రాణి తదితరులు పాల్గొన్నారు.





# గురువులు పాఠాలు బోధించేవి శ్రద్ధగా వింటే ఉన్నత స్థాయిలో ఉంటారు

### -గుడివాడ డి. ఎస్. పి. పాలా శ్రీనివాస్

గుడివాడ, ఆగష్టు 16 నేటి శుభోదయ : గురువులుపాఠాలు బోధించే సమయంలో శ్రద్ధగా వింటే పరీక్షల్లో రాణిస్తారాని గుడివాడ డి. ఎస్. పి. పాలా శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆడుసుమిల్లి గోపాలకృష్ణయ్య మునిసిపల్ హైస్కూల్ లో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్గీయ పామర్తి హరినారాయణ చారిటబుల్ ట్రస్ట్ పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్, నగదును అందించిన అనంతరం మాట్లాడారు. చదువులో రాణించిన ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయిలో ఉంటారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు ప్రతి ఒక్కరు ప్రయివేటు పాఠశాలలో చదువుకున్న వారితో ధీటుగా రానిస్తున్నారని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ పామర్తి లీలావతి తన తండ్రి పేరిట విద్యార్థులను మెడల్స్, సర్టిఫికెట్, నగదు ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మహిళా విభాగపు రాష్ట్ర అధ్యక్షురాలు, పాఠశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ పామర్తి లీలావతి మాట్లాడుతూ తాము పాఠశాలలో అల్లరి పిల్లల బ్యాచ్ అని, తమ గురువులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని ఉన్నత స్థాయిలో ఉన్నామని, మీరుకూడా చక్కగా చదివి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. ప్రతజీ ఏటా ముగ్గరికి ప్రోత్సాహక బహుమతి ఇస్తున్నానని, ఎక్కువ మండి పోటీపడి చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాడిస్తే అంతమందికి ప్రోత్సాహక బహుమతులు ఇస్తానని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తమ పాఠశాలలో గత ఏడాదికంటే ఈఏడాది ప్రతి సబ్జెక్టులోఅత్యధిక మార్కులు సాధించారని, దీనికి పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల కృషి అన్నారు. కార్యక్రమంలో పలువురు పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# టిడిపి ఆధ్వర్యంలో గుడివాడలో ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు

### -17వ వార్డులో లచ్చన్న విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
### -బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం లచ్చన్న పోరాటం స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే రాము
### -లచ్చన్న ఆశయాలను నేటి తరానికి అందించాలి : ఎమ్మెల్యే రాము





గుడివాడ, ఆగస్టు 16 నేటి శుభోదయ : గుడివాడ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 117 వ జయంతి వేడుకలు ఆదివారం ఉదయం ఘనంగా జరిగాయి. 17వ వార్డులోని ఓల్డ్ సంత బజార్ రోడ్డులో ఉన్న సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి కూటమి నాయకులు, బీసీ సంఘాల నాయకులతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా "జోహార్ సర్దార్ లచ్చన్న" అంటూ ఎమ్మెల్యే రాము, కూటమి నాయకులు నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాము మిఠాయిలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం లచ్చన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. సమాజంలో అణగారిన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పించాలన్నదే లచ్చన్న లక్ష్యమని... ఆ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే రాము అన్నారు.ప్రజాసేవకు, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ సర్దార్ లచ్చన్న చూపిన మార్గంలో నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.గుడివాడలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. జయంతి వేడుకల్లో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబశివరావు, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, రామదేని వేణుబాబు, చేకూరు జగన్మోహన్ రావు, దేవరపల్లి కోటి, సురగని సూరిబాబు, యార్లగడ్డ సుధారాణి, ఏడుకొండలు, మరీదు రోహిణి కుమార్, మరీదు కరుణకుమారి, మద్దుకురి ప్రభాకర్, సొంటి శ్రీనివాస్, శ్రీనివాస్, సొంటి కోటయ్య, షేక్ మీరా షరీఫ్, సొంటి అయ్యప్ప, మానం రమేష్, రమణ, రావులమ్మ, రఫీ, నాగరాణి, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన సెంట్రల్ నియోజకవర్గ గౌడ్ సంఘ నాయకులు



విజయవాడ, ఆగస్టు 16 (నేటి శుభోదయ): అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కార్యాలయం వద్ద స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను ఆదివారం కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా నాయకుడు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడు గౌతు లచ్చన్న చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం కార్యకర్తలు, నాయకులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ గౌతు లచ్చన్న కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, తెలుగు వారి ఆత్మగౌరవం కోసం, ప్రజల హక్కుల కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో ధైర్యంగా పోరాడిన లచ్చన్న, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రజల పక్షాన నిలబడిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు.అటువంటి మహనీయుల త్యాగాలను, సేవలను నేటి తరం మాత్రమే కాకుండా రాబోయే తరాలు కూడా స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు, గౌతు లచ్చన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని సిద్ధార్థ అన్నారు.ప్రతి సంవత్సరం గౌతు లచ్చన్న జయంతి, వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన నివాళులు అర్పిస్తామని బొండా సిద్ధార్థ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిరియ జగదాంబ, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సింగం వెంకన్న, సెంట్రల్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ఇప్పిలి రామ్మోహన్, బెజవాడ తిరుపతి గౌడ్, సర్వేపల్లి అమర్నాథ్ గౌడ్, పలగాని భాగ్యలక్ష్మి, పిరియ సోమేశ్వరరావు, చిన్న, ఇమిడి రాము, పలగాని సీతారామయ్య, డాక్టర్ శ్రీనివాసరావు, మధు, కేశం వేణు, గుణ్ణం నాగార్జున, సూర్య ప్రసాద్ రావు, వాసంశెట్టి శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న ను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

### -జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి



పెనమలూరు, ఆగష్టు 16 నేటి శుభోదయ : స్వాతంత్ర్య సమరయోధులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న ను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ ఉ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. ఆదివారం పెనమలూరు మండలం యనమలకుదురులో గౌతు లచ్చన్న 117 జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడారు.ఆయన ఆశయాలు భవితరాలకు తెలియచేసి సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ ఉ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంటి శివరాం ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు అనంతనేని ఆజాద్, బెజవాడ శివయ్య , వీరంకి నంది, రేవంత్ పాల్గొన్నారు.

# ఇర్ఫాన్‌కు ఉత్తమ సేవా పురస్కారం



పులిచెర్ల, ఆగష్టు 16,(నేటి శుభోదయ) : 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏపిఎస్పీడీసీఎల్ రెడ్డిగుంట డివిజన్ పరిధిలో నస్సూరువారిపల్లి జూనియర్ లైన్మెన్ ఇర్ఫాన్‌కు ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం అందజేశారు. ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సేవలను సకాలంలో అందించడం, వినియోగదారులకు బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఇర్ఫాన్ మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మరిన్ని ప్రశంసలు అందుకునేలా పనిచేస్తానని తెలిపారు.

# విశ్వ హిందు ధర్మ పరిరక్షణ సమితి రామసేన అధ్యక్షులు 'కంబాల శ్రీనివాసరావు' దంపతులకు అరుదైన గౌరవం...!!

**- ఆధ్యాత్మిక ధార్మిక ప్రజాసేవలకు మెచ్చి ఘనంగా సత్కరించిన 'బ్రహ్మశ్రీ' చాగంటి కోటేశ్వరరావు..!!**





కోరుకొండ, ఆగస్టు 16 నేటి (శుభోదయ) :రాజమండ్రి శ్రీజూపూడి సరోజినీ దేవి కళా ప్రాంగణంలో శనివారం రాత్రి ప్రారంభమైన సంగీత నృత్యోత్సవ సప్తాహం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్సీ సోము వీర్రాజు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలిత కంబాల శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ సోము వీర్రాజు కంబాల శ్రీనివాసరావు ప్రసంగించారు. తదుపరి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గొప్ప ప్రవచనాలను ప్రజలకు ప్రసంగించారు. కార్యక్రమం అనంతరం ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు, ఆలయాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమానికి విశిష్ట కృషి చేస్తున్న కంబాల శ్రీనివాసరావు సేవలను మెచ్చి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు స్వయంగా కంబాల శ్రీనివాసరావు సేవలను అడిగి తెలుసుకొని కంబాల దంపతులను శాలువా కప్పి, సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసారు. కంబాల శ్రీనివాసరావు సేవలను అభినందించి, ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమకు దక్కిన ఈ అరుదైన గౌరవం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. చాగంటి కోటేశ్వరరావు స్వయంగా తమకు ఆశీస్సులు అందించడం, తమకు అరుదైన గౌరవం దక్కడం నిజంగా మహద్భాగ్యం అన్నారు. ఇది జీవితంలో మరువురాని మధురమైన ఘట్టంమని, సేవలను గుర్తించి ఇంతటి గౌరవం అందించడం ఎంతో గర్వకారణం ఉందన్నారు. ఈ గౌరవం వ్యక్తిగత ఆనందం మాత్రమే కాదని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో ప్రజాసేవ చేయాల్సిన బాధ్యతను పెంచిందన్నారు..




# విశాఖకు బిజేపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాక..!!

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి భారీ ఏర్పాట్లు**
**- ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్**
**- 17న భోగాపురం విమానాశ్రయంలో జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం**
**- 18న విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం.. 945 మండలాల ప్రతినిధుల హాజరు**
**- పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, రైల్వే జోన్ సహా రాష్ట్ర ప్రగతిపై తీర్మానాలు**

విశాఖపట్నం, నేటి శుభోదయ ఆగస్టు :16 :భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నితిన్ నబీన్ తొలిసారిగా విశాఖపట్నం రానున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. 17న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమవుతున్న రోజే రాత్రి 9 గంటలకు నితిన్ నబీన్ విశాఖకు చేరుకోవడం ఆనందకర పరిణామమన్నారు. డాల్ఫిన్ హోటల్‌లో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**18న రాష్ట్ర కార్యవర్గ సమావేశం:**

కొత్త రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైన నేపథ్యంలో 18న విశాఖలోని వి-కన్వెన్షన్ హాల్‌లో విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు మాధవ్ చెప్పారు. రాష్ట్రంలోని 945 మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, రాష్ట్ర పదాధికారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలవారీగా పార్టీ సంస్థాగత నిర్మాణం, ప్రగతి, ఏడు మోర్చాల కార్యక్రమాలను ప్రదర్శించే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

**రాష్ట్ర ప్రగతిపై రెండు కీలక తీర్మానాలు**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో రాష్ట్రానికి జరిగిన అభివృద్ధి, వచ్చిన పెట్టుబడులపై ఒక తీర్మానం, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుపై మరో తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు మాధవ్ తెలిపారు. బీజేపీ అఖిల భారత సంఘటన మంత్రి బీఎల్ సంతోష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభారిగా ఉన్న శివప్రకాశ్ తదితర జాతీయ నాయకులు సమావేశానికి హాజరవుతారని చెప్పారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ద్వారా జరుగుతున్న అభివృద్ధిని, ట్రిపుల్ ఇంజిన్ గ్రోత్‌ను ప్రజలకు చాటేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పోలవరం.. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు**

పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మాధవ్ తెలిపారు. త్వరలో గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరే పరిస్థితి ఏర్పడుతోందని, అనంతరం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు సాగు, తాగునీటి భద్రత కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. 24.33 టీఎంసీల తాగునీటి లభ్యత కూడా ఈ ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

**విశాఖ అభివృద్ధికి కొత్త ఊపు**

విశాఖలో గూగుల్ వంటి భారీ పెట్టుబడులు రావడంతోపాటు డేటా కేబుల్ ప్రాజెక్టులు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటై విశాఖను ప్రధాన కేంద్రంగా మార్చడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని మాధవ్ తెలిపారు. కొత్త రైల్వే లైన్లు, స్టేషన్లు, రైళ్లతో విశాఖ ప్రాధాన్యం మరింత పెరగనుందని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మలుపన్నారు. ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ వంటి భారీ పరిశ్రమలు, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో సుమారు రూ.1.84 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, బల్క్ డ్రగ్ పార్క్ తదితర ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున అభివృద్ధి ప్రాజెక్టులు వస్తున్నాయని చెప్పారు.

**నితిన్ నబీన్‌కు ఘన స్వాగతం**

నితిన్ నబీన్‌కు ఘన స్వాగతం పలికేందుకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఎమ్మెల్యే ఈశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మాధవ్ తెలిపారు. తప్పెటగుళ్లు, డప్పులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలకనున్నట్లు చెప్పారు. నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమాలను విష్ణుకుమార్ రాజు, ఇతర నాయకులు, నగర అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు వెల్లడించారు.

**యువతతో జాతీయ అధ్యక్షుడి ముఖాముఖి**

18న సాయంత్రం 4 గంటలకు గ్రాండ్ బే హోటల్‌లో 25 ఏళ్లలోపు 250 మంది ఎంపిక చేసిన యువతతో నితిన్ నబీన్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాధవ్ తెలిపారు. యువ న్యాయవాదులు, వైద్యులు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు తదితరులు ఇందులో పాల్గొంటారని చెప్పారు.

**కూటమి ప్రభుత్వం.. స్థానిక ఎన్నికలకు సమాయత్తం**

చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందని మాధవ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమిగా కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాట్య అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన మద్దాల యేసుపాదంకి ఘన సత్కారం..!

**- కార్యక్రమంలో పాల్గొన్న రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, శ్రీమతి వెంకటలక్ష్మి దంపతులు..!!**





కోరుకొండ, ఆగస్టు 16 (నేటి శుభోదయ) : సీతానగరం మండలానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు మద్దాల యేసుపాదం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాట్య అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా సీతానగరం మండలంలోని జి.వి.కె. ఫంక్షన్ హాల్ నందు ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు రాజనగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, వారి సతీమణి శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మద్దాల యేసుపాదంని బత్తుల బలరామకృష్ణ దంపతులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ.. 'జనసేన పార్టీ బలోపేతానికి, సిద్ధాంతాల వ్యాప్తికి నిరంతరం శ్రమించిన సీనియర్ నాయకులు మద్దాల యేసుపాదం సేవలకు తగిన గుర్తింపు లభించింది. ప్రజాక్షేత్రంలో ఆయన చేసిన కృషికి ప్రతిఫలంగానే కూటమి ప్రభుత్వంలో వారికి ఈ బాధ్యత దక్కింది. నాట్య అకాడమీ డైరెక్టర్‌గా కళలకు, కళాకారులకు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తూ, నియోజకవర్గానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నాను..అని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కి, కూటమి పెద్దలకు మరియు తనకు నిరంతరం అండగా నిలిచిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకి మద్దాల యేసుపాదం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని యేసుపాదంకి అభినందనలు తెలిపారు.

# పందెం రాయుళ్లపై మెరుపు దాడి

**- వడ్లగూడెంలో ఎస్సైని చూసి పరార్ - అక్రమార్కులకు చెక్ పెట్టిన రాజేష్**
**- జూదం చట్ట విరుద్ధం ఎస్ఐ హెచ్చరిక**

ఖమ్మం, నేటి శుభోదయ :ప్రస్తుతం జూదాలు, బెట్టింగులు అరికట్టే ప్రమాణాలకు పూర్తి సమాచారాన్ని అందుకుంటున్న ఎస్సై బంధం రాజేష్ కుమార్ ప్రస్తుత వచ్చిన కొద్ది కాలంలోనే అనేక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశారనే సందిగ్నంగా స్పష్టమవుతుంది. కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలంలోని వడ్లగూడెం గ్రామ శివారులో కోడిపందస్థావురాలు నిర్వహించి, బెట్టింగులకు పాల్పడుతున్నారని రహస్యంగా సమాచారాన్ని అందుకున్నారు. ఎలాగైనా అక్రమార్కులపై జూలు జూలపాలని వెంటనే కోడి పందేల పరిసర ప్రాంతాలకు బయలుదేరారు. పోలీస్ అధికారులను చూసిన జూదగాళ్లకు ఒక్కసారిగా చెమటలు పట్టాయి, కొందరు ఏకంగా వాగులు వంకలు గుట్టలు మెట్టలు దూకుకుంటూ పారిపోయారని పోలీసు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మూడు కోళ్లు ఎనిమిది బైకులు, వెయ్యి రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దమ్మపేట ఎస్సై బంధం రాజేష్ కుమార్ మాట్లాడుతూ అత్యాశకు పోయి ఎవరు అధోగామ స్థితిలో పడొద్దని, కోడిపందాలు చట్ట వ్యతిరేకమని, ప్రోత్సహించినా కూడా శిక్ష పడే పరిణామాలు ఉన్నాయని, కోడిపందాలు, పేకాట లాంటి జూదాలు కొనసాగిస్తే నిర్మొహమాటంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవకాశవాదులుగా




మారి జీవితాలను అయోగమపమలో పడ వెయ్యొద్దని, నిజనిర్ధారణమైన కోడిపందాలు పేకాట రాయుళ్లు ప్రస్తుత వాళ్ళ జీవితకాల పరిణితి కోర్టు సమయాలకు కేటాయించవలసి వస్తుందని, కుటుంబ బాధ్యతలతో భద్రతగా జీవించాలని, దమ్మపేట మండల పరిధిలో కోడి పందాలు పేకాట, ఇలాంటి జూదాలకు పాల్పడితే తక్షణమే దమ్మపేట పోలీస్ అధికారులకు బాధ్యత గల పౌరులుగా సమాచారం అందించాలని తక్షణమే 100 డయల్ చేసి వివరాలు చెప్పండి అని తెలియజేశారు.

## వికసిత్ భారత్ నిర్మాణానికి యువత నడుం బిగించాలి..!!







విశాఖపట్నం నేటి శుభోదయ ఆగస్టు : 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా అనగా వికసిత్ భారత్ గా చూడడానికి యువత నడుం బిగించాలని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయ దేవి అన్నారు. 17 పారిశ్రామిక ప్రాంతం పశ్చిమ నియోజకవర్గం లో స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించిన 80 వ, స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఆమె ప్రసంగిస్తూ– వికసిత్ భారత్ లక్ష్యసాధనకు యువత నైపుణ్యాలను పెంచుకోవాలని, మహిళా సాధికారతకు, పర్యావరణ పరిరక్షణకు, రాజ్యాంగ ఆదర్శాల అమలుకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాదర్ జీవన్ బాబు మాట్లాడుతూ– యువత స్పష్టమైన లక్ష్యంతో, కఠోర శ్రమతో, మంచి అలవాట్లతో దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్ తదితరులు ప్రసంగించారు. అంతకుముందు ఫాదర్ జీవన్ బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థినుల కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరిం చాయి. అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ సేవా పథక వాలంటీర్లకు అభినందనలు..!!






విశాఖపట్నం నేటి శుభోదయ ఆగస్టు : 17 విశాఖ జిల్లాలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలో గల జాతీయ సేవా పథకంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి 80 వ,స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా అభినందించారు. 2026 జనవరిలో రిపబ్లిక్ డే పెరేడ్ లో పాల్గొన్న కె.లక్ష్మణ్ మరియు పి. జస్వంతులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రూప్ డాన్స్ లో ప్రతిభ కనబరిచిన గాయత్రి విద్యా పరిషత్ వాలంటీర్లను కూడా ఆమె అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు. అంతకుముందు "ప్రస్తుత భారతావనిలో యువనాయకత్వం" అనే అంశంపై భాగ్యలక్ష్మి ప్రసంగించారు.

## మాజీ ప్రధాని వాజ్ పాయ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన..!!

**- రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్**



విశాఖపట్నం నేటి శుభోదయ ఆగస్టు : 16 బహుముఖ ప్రజ్ఞాశాలి దేశంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప నాయకులు అటల్ బీహార్ వాజపేయ్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ అన్నారు. ఈ మేరకు మన్యం జిల్లా బీజేపీ ఇంచార్జి, చైల్డ్ లేబర్ బోర్డు డైరెక్టర్ పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో గాజువాక డిపో ఆంజనేయ స్వామి గుడి ఎదరుగా అటల్ బీహార్ వాజ్ పేయ్ విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీన్ మాధవ్ మాట్లాడుతూ భారత రాజకీయాలలో అత్యంత మరియు ప్రజాదరణ పొందిన నాయకుల్లో ఒకరని,అలాగే అద్భుతమైన వక్త మరియు కవి అన్నారు. దేశంలోని నాలుగు ప్రధాన రహదారులు ఢిల్లీ,ముంబై,చెన్నై,కోల్కత్త,వంటి రాష్టాల ప్రధాన నగరాలను కలుపుతూ భారీ జాతీయ రహదారులు నిర్మించారన్నారు. పాకిస్తాన్ చొరబాటుదారులకు వ్యతిరేకంగా జరిగిన కార్గిల్ యుద్ధంలో ఆపరేషన్ విజయ్ ద్వారా భారతదేశానికి ఘన విజయం అందించారన్నారు. ఆరు సంవత్సరాల నుండి 14 సంవత్సరాల పిల్లలందరకి ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను అందించే విప్లవాత్మకమైన పథకాన్ని ప్రారంభించారన్నారు. దేశానికి చేసిన విశిష్ట సేవలకు గాను 2015 లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న లభించింది అన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రస్తుత దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలన సాగిస్తూ దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు అన్నారు.మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజపేయి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన పొలిమేర శ్రీనివాసరావు బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు,టిడిపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు , పచ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు కుమారుడు మౌర్య సింహా,జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ అంగ ప్రశాంతి,టిడిపి మాజీ కార్పొరేటర్ పుర్రె సురేష్ యాదవ్,దాడి రమేష్ నాయుడు,విజయ్ బాబు,పొట్టి మూర్తి,ధానేష్,నాందెల్ల జ్యోతి,ములకలపల్లి ప్రకాష్,సిరసపల్లి నూకరాజు,కట్టా పద్మ,యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీబీ జనరల్ మేనేజర్ పద్మకు శుభాకాంక్షలు తెలిపిన ఆకుల గాంధీ



ఖమ్మం, నేటి శుభోదయ : ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)ఉన్నతికి విశేష సేవలందిస్తున్న జనరల్ మేనేజర్ ఆకుల పద్మావతి కి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రుణాల పంపిణీ, అడ్వాన్సుల చెల్లింపులు, వసూళ్ల విషయంలో చూపుతున్న ప్రతిభ, బ్యాంక్ పురోభివృద్ధికి చేస్తున్న పద్మావతి కృషిని ప్రభుత్వం గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆమెకు ఈ పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పద్మావతి సమీప బంధువు,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ సంతోషం వ్యక్తం చేస్తూ ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తన ఆశీస్సులు అందజేశారు.అంగ వైకల్యాన్ని సైతం లెక్క చేయకుండా విధి నిర్వహణ పట్ల అంకితభావం కలిగి బ్యాంక్ ఉన్నతికి పాటుపడుతున్న పద్మావతి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు.ఆమె ఇటువంటి ప్రశంసా పత్రాలు,పురస్కారాలు మరెన్నో అందుకుంటూ అందరి మన్ననలు పొందాలని ఆకుల గాంధీ అభిలషించారు.

## సినీ నటుడు, సీనియర్ ఫోటోగ్రాఫర్ పైలా సత్యనారాయణమూర్తి (జయ గోపాల్ స్టూడియో కుమార్) ఇక లేరు..!

**- దిగ్భ్రాంతికి గురైన కళాకారులు, గ్రామస్తులు..!**









కోరుకొండ, ఆగస్టు 16 (నేటి శుభోదయ) : సినీ నటుడు, సీనియర్ ఫోటోగ్రాఫర్, రాజమండ్రి జూనియర్ ఆర్టిస్టుల సప్లై మేనేజర్ పైలా సత్యనారాయణమూర్తి (72) ఇక లేరు. మద్రాన్, హైదరాబాద్ సినిమా ఇండస్ట్రీలల్లో 'కోరుకొండ కుమార్' గా అందరికి సుపరిచితమైన సత్యనారాయణమూర్తి 'జై గోపాల్ ఫోటో స్టూడియో అధినేత' ఆదివారం మధ్యాహ్నం విజయవాడ వెళ్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందారు. విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి ఆయన మృతదేహాన్ని కోరుకొండ స్వగృహానికి ఆదివారం సాయంత్రం తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అందరూ వివాహాలై స్థిరపడ్డారు. కాగా కోరుకొండ కుమార్ గా పేరు తెచ్చుకున్న సత్యనారాయణమూర్తి కోరుకొండలో 'జై గోపాల్ ఫోటో స్టూడియో' అధినేతగా ఈ చుట్టూ పక్కల ప్రాంతాల వారికి బాగా సుపరిచితమే.. కాగా వందలాది సినిమాలకు ఆయన జూనియర్ ఆర్టిస్టుగా, డైలాగ్ ఆర్టిస్ట్ గా పని చేశారు. తర్వాత చిన్న స్థాయి సినీ నటునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తదుపరి వయసు భారం పెరగడంతో జూనియర్ ఆర్టిస్ట్ సప్లై మేనేజర్ గా రాజమండ్రిలో కార్యాలయం ఏర్పాటు చేసి సినిమా పరిశ్రమకు సేవలు అందిస్తున్నారు. కుమార్ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ఎందరో కళాకారులకు జూనియర్ ఆర్టిస్టులుగా కార్డులు మంజూరు చేసి ఉభయగోదావరి జిల్లాలలో జరిగే షూటింగ్లలో పని కల్పించేవారు. కాగా ఆయన ఆకస్మిక మరణంతో ఇటు జూనియర్ ఆర్టిస్టుల్లోనూ, అటు కోరుకొండ పశ్చిమ గోనగుడెం గ్రామాల్లోనూ విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి ఆయన భౌతిక దేహాన్ని కోరుకొండ పరిసర గ్రామాలకు చెందిన బంధుమిత్రులు, కళాకారులు, శ్రేయోభిలాషులు వచ్చి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఆయన మృతదేహానికి రాజమండ్రిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## 61 వ వార్డులో జనసేన నేత దుంగ దేవన్ రాజు ఆధ్వర్యంలో..

**- దోమల నివారణకు మినీ ఫాగింగ్..**



విశాఖపట్నం నేటి శుభోదయ ఆగస్టు : 16 వార్డు ప్రజల వినతి మేరక ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ , శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ఆలయ ధర్మకర్త, జనసేన పార్టీ , 61వ వార్డు అధ్యక్షులు దుంగ దేవన్ రాజు ఆధ్వర్యంలో మినీ ఫోగింగ్ నిర్వహించారు, దేవన్ రాజు మాట్లాడుతూ.. ఈ మధ్య కురిసిన చిన్నపాటి వర్షాలు కారణంగా తేమ , చెమ్మ , చెత్తా చెదారాలు పేరుకు పోవడం వల్ల దోమలు , క్రిమి కీటకాలు ఎక్కువై డెంగ్యూ , మలేరియా తదితర విషజ్వరాలు అధికంగా ఉ ఒడడం కారణంగా నివారణ కొరకు మినీ ఫోగింగ్ వెంకన్నపాలెం, రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ సిబ్బందితో కలసి ఫోగింగ్ నిర్వహించారని తెలిపారు, ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది , జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .